సాక్షి
పెద్దపల్లి
శనివారం । 1 । జూలై । 2023



ప్రశాంతతకు మారుపేరు..

ప్రశాంతత, భద్రతకు అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామం మారుపేరుగా నిలుస్తోంది. గ్రామంలో మొత్తం 95 కుటుంబాలుండగా, 421 ఓటర్లున్నారు.

IIలో ▸



నృసింహుని ఆదాయం లెక్కింపు

ధర్మపురి: లక్ష్మీనృసింహస్వామికి గత మార్చి 24 నుంచి శుక్రవారం వరకు రూ.60.96 లక్షల ఆదాయం, 53 గ్రాముల బంగారం, 9.850 కిలోల వెండి, 52 విదేశీ కరెన్సీ నోట్లు సమకూరాయి.

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గ్రూప్‌-4 పరీక్షలకు సర్వం సిద్ధం



హాల్‌ టికెట్‌ నంబర్లు వేస్తున్న సిబ్బంది

పెద్దపల్లిరూరల్‌: గ్రూప్‌- 4 పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 17,927 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానుండగా, 43 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అభ్యర్థులు 15 నిమిషాలు ముందే కేంద్రాలకు చేరుకోవాలని, గేట్లు మూసిన తర్వాత ఎవరినీ లోనికి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులు ఉదయం 9.45 గంటల్లోపు, మధ్యాహ్నం 2.15 గంటల్లోపు కేంద్రాల్లోకి చేరుకోవాలన్నారు. పరీక్ష ముగిసిన తర్వాత అభ్యర్థులు ఓఎంఆర్‌ షీటు ఇచ్చి ఎడమచేతి బొటనవేలు థంబ్‌ ఇంప్రెషన్‌ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జిల్లా గణాంకదర్శిని పుస్తకావిష్కరణ

పెద్దపల్లిరూరల్‌: జిల్లా గణాంకదర్శిని (డిస్ట్రిక్ట్‌ హ్యాండ్‌ ఆఫ్‌ స్టాటిస్టిక్స్‌- 2022) పుస్తకాన్ని కలెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌.సంగీత శుక్రవారం ఆవిష్కరించారు. ప్రొఫెసర్‌ పీసీ మహలనబీస్‌ జయంతిని పురస్కరించుకుని ఏటా జూన్‌ 29న కేంద్ర ప్రభుత్వం జాతీయ గణాంకాల దినోత్సవం జరుపుకుంటున్నదని కలెక్టర్‌ పేర్కొన్నారు. గణాంకదర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, కమ్యూనికేషన్‌, బ్యాంకింగ్‌, ఫైనాన్స్‌, ఎకానమీ, సోషల్‌ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు వివరంగా ఉంటాయన్నారు. అనంతరం ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో మహలనబీస్‌ జయంతిని నిర్వహించారు. అదనపు కలెక్టర్‌ వి.లక్ష్మీనారాయణ, ముఖ్య ప్రణాళిక అధికారి గంప రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

పెద్దపల్లిరూరల్‌: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే అందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్‌ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశం జరిగింది. జిల్లాలో జరిగే ప్రసవాల్లో 1,000 మంది మగ పిల్లలకు 936 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని డీఎంహెచ్‌ఓ తెలిపారు. జిల్లాలో ఆడపిల్లకు జన్మనిచ్చేవారిని ప్రోత్సహించేలా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినవారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.పదివేల జరిమానా విధించబడుతుందని వివరించారు. సమావేశంలో జిల్లా రెడ్‌క్రాస్‌ సొసైటీ కన్వీనర్‌ రాజగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి



అధికారులతో చర్చిస్తున్న శ్రీధర్‌బాబు

పాలకుర్తి(రామగుండం): బసంత్‌నగర్‌ కేశోరాం సిమెంట్‌ కర్మాగారంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్‌ కార్మికుల పెండింగ్‌ సమస్యలు త్వరగా పరిష్కరించాలని కాంట్రాక్ట్‌ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు, ఏఐసీసీ కార్యదర్శి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కంపెనీ ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం సీఈఓ రాధాకృష్ణన్‌, సీఎంఓ వెంకటపతిరాజుతో సమావేశమై చర్చించారు. అర్హులైన కార్మికులకు కాంట్రాక్ట్‌ బేసిక్‌ పదోన్నతి, ఇంక్రిమెంట్స్‌ పెంచాలని, కార్మికసంఘం ఎన్నికలలోపు సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. స్పందించిన అధికారులు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు కార్మికసంఘం నాయకులు తెలిపారు. ఈసందర్భంగా శ్రీధర్‌బాబును కంపెనీ అధికారులు సత్కరించారు. కాంట్రాక్ట్‌ కార్మికసంఘం అధ్యక్షుడు సూర సమ్మయ్య, ప్రధాన కార్యదర్శి కాల్వ అంజయ్య, కేశోరాం ప్లాంట్‌హెడ్‌ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అలాగే పర్మినెంట్‌ కార్మికసంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి కంపెనీ సీఈఓ, సీఎంఓలతో కార్మికుల సమస్యలపై చర్చించారు. ప్రధాన కార్యదర్శి దాడి మహేష్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ పర్శవేని శ్రీనివాస్‌ తదితరులున్నారు.

వరదొస్తే అంతే..



దాటడం కష్టమే..

'ఇది ధర్మారం మండలం కటికనపల్లి వద్ద ఉన్న లోలెవల్‌ బ్రిడ్జి. ఈ దారిగుండానే పెద్దపల్లికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రతి వర్షాకాలంలో వంతెన నీటమునిగి ప్రజలు అవస్థలు పడుతున్నారు. విద్య, వైద్యం ఇతర అత్యవసర సేవలకు ఇబ్బందులు తప్పడం లేదు'.

- లోలెవల్‌ కష్టాలు తీరేదెన్నడో..?
- ఏటా వర్షాకాలంలో ప్రజలకు తప్పని ఇక్కట్లు
- భారీ వర్షాలకు వాగులపై రాకపోకలు బంద్‌
- అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులు



వెన్నంపల్లి- జాఫర్‌ఖాన్‌పేట దారిలో నీటమునిగిన కల్వర్టు (ఫైల్‌)

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పలుచోట్ల లోలెవల్‌ వంతెనల పైనుంచి వరద ప్రవహించి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండుమూడు రోజుల పాటు వరద నీరు ఉండడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలకు చేరుకోవడంలో ప్రయాస, అత్యవసర వైద్య సేవలందడంలో జాప్యం, రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లలేక ఇబ్బందులు, చదువుకునేందుకు వెళ్లలేక విద్యార్థుల అవస్థలు.. ఇలా ఆయా గ్రామాల ప్రజలు తిప్పలు సర్వసాధారణమై పోయాయి. ఒకట్రెండు చోట్ల అని కాకుండా జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ సమస్యలు ఉన్నాయి. కొన్నేళ్ల కిందట నిర్మించిన కల్వర్టులు, బ్రిడ్జిలు రహదారి కంటే కిందకు ఉండటంతో రోడ్డు పైనుంచి వరద ప్రవహిస్తోంది. వాటిని ఎత్తు వంతెనలుగా మార్చకపోవడంతో కష్టాలు తప్పడం లేదు. రహదారుల నిర్మాణాలు, మరమ్మతులకు ఏటా కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతున్నా ప్రభుత్వాలు అసలు వాటిని పట్టించుకోవడం లేదని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు. వర్షాలు కురిసినప్పుడే తాత్కాలిక చర్యలతో నెట్టుకొస్తున్నారు. దీంతో ఏళ్ల తరబడి ప్రజలు అగచాట్లు పడుతున్నారు.

కనిపించని హెచ్చరిక బోర్డులు

లోలెవల్‌ వంతెనలు, కాజ్‌వేలు మృత్యుపాశంగా మారుతున్నాయి. ఎప్పుడు వరదలొచ్చినా అవి తక్కువ ఎత్తులో ఉండడంతో వాహనదారులు, ప్రజలు అంచనావేయలేక తరుచూ వరదల్లో చిక్కుకుంటున్నారు. కొందరు ప్రాణాలు కోల్పోయి ఘటనలూ ఉన్నాయి. కాగా ప్రమాదకర ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, ఇతరత్రా ప్రమాద నివారణ చర్యలు చేపట్టడం లేదు. పాలకులు, అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు. కొన్ని ప్రధాన వంతెనల వద్ద మాత్రమే రక్షణ పిల్లర్లు కనిపిస్తుండగా మరికొన్నిచోట్ల ఎలాంటి రక్షణ చర్యలు లేవు. జిల్లావ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌ శాఖల పరిధిలో ఇలాంటివి విరివిరిగా ఉన్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

రాకపోకలకు అవస్థలు



'ఇది కాల్వశ్రీరాంపూర్‌ మండలం కూనారం గ్రామంలోని జగదాంబ ఒర్రె కల్వర్టు. ఏమాత్రం భారీ వర్షం వచ్చినా ఈ మార్గంలో నీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అలాగే రక్షణ సూచిక సైతం లేదు. వానకాలంలో ఈమార్గం గుండా వెళ్లేందుకు పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతుంటారు. ఈ కల్వర్టును బాగుచేసి ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు'.

మరో దారిలేదు



'ఈచిత్రంలో కనిపిస్తున్నది ఎలిగేడు మండలం ధూళికట్ట, వడుకాపూర్‌ గ్రామాల సరిహద్దున గల హుస్సేనీమియా వాగుపై లోలెవ్‌ల బ్రిడ్జి. వానాకాలం వచ్చిందంటే రెండు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎలిగేడు నుంచి జూలపల్లి మండలాలకు పోవాలంటే రూట్‌ మార్చుకోవాల్సిందే. కరీంనగర్‌ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సు సైతం ధూళికట్ట నుంచి వెనక్కి తిరిగిపోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది'.

ఏటా మునుగుడే..



'ఈఫొటో పెద్దపల్లి మండలం కొత్తపల్లి శివారులోని లోలెవల్‌ కాజ్‌వే. వాహనదారులు పెద్దపల్లి నుంచి ఓదెల మండలం కొలనూర్‌, కాల్వశ్రీరాంపూర్‌, పక్క జిల్లాలకు సైతం ఇదే దారి ప్రయాణిస్తుంటారు. వాగు ఉధృతి పెరిగిన సందర్భంలో మనుషులు, బైక్‌లు కొట్టుకుపోయి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి'.

కమిషనరేట్‌లో ఎస్‌ఐల బదిలీ

గోదావరిఖని(రామగుండం): రామగుండం పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో 28మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ కమిషనర్‌ రెమా రాజేశ్వరి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు బదిలీ అయిన స్థానాల్లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

ఎస్సై పేరు	ప్రస్తుతం	బదిలీ ప్రాంతం
బొల్లంపల్లి సౌజన్య	చెన్నూర్‌	గోదావరిఖని వన్‌టౌన్‌
ఎస్‌.లచ్చన్న	మంచిర్యాల	సీఎస్‌బీ, రామగుండం
బి.మల్లేశ్‌	సైబర్‌ క్రైం	పెద్దపల్లి, ఎస్‌ఐ-2
ఎ.రాజమణి	బెల్లంపల్లి-1	సీఎస్‌బీ, రామగుండం
జి.సంధ్యారాణి	శ్రీరాంపూర్‌	సీఎస్‌బీ, పెద్దపల్లి
టి.గంగరాజగౌడ్‌	జైపూర్‌, ఎస్సై-2	బసంత్‌నగర్‌, ఎస్‌ఐ-2
ఎస్‌.స్వరూప్‌రాజ్‌	వీఆర్‌, రామగుండం	సీసీఎస్‌, పెద్దపల్లి
బి.వెంకటస్వామి	ఎస్‌హెచ్‌ఓ, కోటపల్లి	గోదావరిఖని, వన్‌టౌన్‌
జి.సురేశ్‌	మంచిర్యాల	ఎస్‌హెచ్‌ఓ, కోటపల్లి
వి.సౌమ్య	వీఆర్‌, మంచిర్యాల	పీసీఆర్‌, మందమర్రి
జి.రమేశ్‌	సీఎస్‌బీ, రామగుండం	బెల్లంపల్లి-1 టౌన్‌
కె.మౌనిక	సీసీఆర్‌బీ	సీఎస్‌బీ, రామగుండం
జి.అనూష	వీఆర్‌, రామగుండం	సీసీఆర్‌బీ, రామగుండం
ఎండీ.తైసుద్దీన్‌	మంచిర్యాల్‌	పీసీఆర్‌, మందమర్రి
ఎ.వెంకటేశ్వర్‌	ఎస్‌హెచ్‌ఓ, మంథని	టాస్క్‌ఫోర్స్‌, పెద్దపల్లి
ఎ.మధుసూదన్‌రావు	టాస్క్‌ఫోర్స్‌, మంచిర్యాల	ఎస్‌హెచ్‌ఓ, మంథని
బేతి రాములు	ఎస్‌హెచ్‌ఓ, ముత్తారం	ఎస్‌హెచ్‌ఓ, కమాన్‌పూర్‌
షేక్‌మస్తాన్‌	ఎస్‌హెచ్‌ఓ, కమాన్‌పూర్‌	వీఆర్‌, రామగుండం
ఎం.శివకేశవులు	ట్రాఫిక్‌, మంచిర్యాల్‌	సీసీఎస్‌, పెద్దపల్లి
ఎం.రాజేంద్రప్రసాద్‌	శ్రీరాంపూర్‌	పీసీఆర్‌, రామగుండం
వి.మధుసూదన్‌	తాండూర్‌	సీసీఎస్‌, పెద్దపల్లి
షేక్‌ ఫరీద్‌	రామకృష్ణాపూర్‌	గోదావరిఖని టూటౌన్‌
ఎస్‌.సుగుణాకర్‌	శ్రీరాంపూర్‌	వీఆర్‌, రామగుండం
ఎం.చంద్రశేఖర్‌	చెన్నూర్‌	గోదావరిఖని టూటౌన్‌
ఎం.శైలజ	గోదావరిఖని వన్‌టౌన్‌	డబ్ల్యూపీఎస్‌, శ్రీరాంపూర్‌
ఎ.రాజేందర్‌	ట్రాఫిక్‌, రామగుండం	డబ్ల్యూపీఎస్‌, శ్రీరాంపూర్‌
జి.నాగరాజు	ట్రాఫిక్‌, రామగుండం	సీఎస్‌బీ, మంచిర్యాల్‌
కె.రమేశ్‌	సీఎస్‌బీ, రామగుండం	టాస్క్‌ఫోర్స్‌, మంచిర్యాల్‌

నేటి నుంచి రోగనిర్ధారణ, డయాలసిస్‌ సేవలు



దయాగ్నోస్టిక్‌ సెంటర్‌, డయాలసిస్‌ కేంద్రం

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో సేవలు మరింత మెరుగుపరుస్తున్నామని జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌ శ్రీధర్‌ తెలిపారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్‌ హబ్‌, డయాలసిస్‌ కేంద్రాలను శనివారం రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆన్‌లైన్‌ (వర్చువల్‌) పద్ధతిలో ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఆసుపత్రికి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వచ్చేవారికి రోగనిర్ధారణ చేసేందుకు అవసరమైన లాబొరేటరీ పరీక్షలు డయగ్నోస్టిక్‌ హబ్‌ ద్వారా తేలనున్నాయి. డయగ్నోస్టిక్‌ హబ్‌ ద్వారా 134 రకాల పరీక్షలు నిర్వహించనున్నట్లు శ్రీధర్‌ పేర్కొన్నారు. అలాగే డయాలసిస్‌ కేంద్రం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 100 మంది రోగులకు పెద్దపల్లి ఆసుపత్రి ఆవరణలోనే సేవలు అందుబాటులోకి వచ్చాయి.

'గృహ నిర్బంధం సరికాదు'



గృహ నిర్బంధంలో నాయకులు

పెద్దపల్లిరూరల్‌: పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డితో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలను శుక్రవారం పెద్దపెల్లి పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈసందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, సీఎం కేసీఆర్‌ కొమురంభీం ఆసిఫాబాద్‌ జిల్లా పర్యటనకు వెళ్తుంటే విపక్షపార్టీలను ఇలా నిర్బంధించడం సరికాదని, కేసీఆర్‌ సర్కారుకు అలవాటుగా మారిందని ఆరోపించారు. ఆయన వెంట నాయకులు ఠాకూర్‌రాంసింగ్‌, రాజు, జనార్దన్‌రెడ్డి, రమేశ్‌, సమ్మయ్య, శ్రీనివాసరావు, ఎండీ ఫహీం, పెండ్యాల కుమార్‌, పుట్ట రవి, కరుణాకర్‌, మొలుగూరి సాగర్‌, కోదాటి వెంకటేశ్వరరావు, బొడ్డుపల్లి శ్రీనివాస్‌, ముత్యాల సంతోష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించాలి

కమాన్‌పూర్‌(రామగిరి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సూధాకర్‌ రావు, వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆర్జీ-3 జీఎం కార్యాలయం పరిసరాల్లో జీఎంలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్‌ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య, అధికారులు ఎలిషా, సీతారామం, బైద్య, శ్రీనివాసులు, చంద్రశేఖర్‌, ఐలయ్య, రవీందర్‌ రెడ్డి, మారుతి, రాజేశ్వరి, తుల శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు

విషాదం.. విచారం..



రోదిస్తున్న రజిత బంధువులు, మృతదేహాలను పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టింట్లో ఉండలేక.. భర్త వద్దకు వెళ్లలేక..

సిరిసిల్లక్రైం/వేములవాడఅర్బన్‌/బోయినపల్లి(వేములవాడ): కరీంనగర్‌ జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌కి చెందిన మొహ్మద్‌ అలీ, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్‌ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన రజిత పదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. మనసులు కలిస్తే చాలు.. మతాలు అవసరం లేదని భావించారు. వారిప్రేమకు గుర్తుగా ముగ్గురు సంతానం కలిగారు. మద్యం మహమ్మారి ఫ్యామిలీలో చిచ్చుపెట్టింది. డబ్బుల కోసం భర్త అలీ తరచూ రజితను వేధించాడు. మూడు రోజుల క్రితం పైసలు తీసుకొస్తేనే ఇంటికి రావాలని పుట్టింట్లో దించి వెళ్లాడు. తల్లిదండ్రులు కూడా తమ వద్ద డబ్బులు లేవని రజితకు చెప్పి.. భర్త వద్దకు వెళ్లాలని సూచించారు. తను ఉండగానే పిల్లలను పట్టించుకోని భర్త..తను చనిపోతే ఏం చూసుకుంటాడని భావించిందో ఏమో అటు భర్త వద్దకు వెళ్లలేక.. ఇటు పుట్టింట్లో ఉండలేక ముగ్గురు పిల్లలతో కలిసి బోయినపల్లి మండలంలోని కొదురుపాక ఫోర్‌లేన్‌ బ్రిడ్జి వద్ద మిడ్‌మానేరులో దూకి ప్రాణాలు తీసుకుంది. మృతులు రజిత, ఆమె కుమారులు మొహమ్మద్‌ అయాన్‌ (7), అసర జబీన్‌ (5) ఉస్మాన్‌ అహ్మద్‌ (14 నెలలు)గా పోలీసులు గుర్తించారు.

దైవదర్శనం కోసం వచ్చి..



సాయికుమార్‌(ఫైల్‌)



శ్రీనాథ్‌ (ఫైల్‌)

జమ్మికుంట(హుజూరాబాద్‌)/గోదావరిఖని: దైవదర్శనం కోసం వచ్చిన ఇద్దరు యువకులు కోనేరులో స్నానానికని వెళ్లి నీటమునిగి ప్రాణాలు వదిలారు. కరీంనగర్‌ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్‌ దర్గా సమీపంలో ఈ ఘటన జరిగింది. బక్రీద్‌ పర్వదినం సందర్భంగా గురువారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన 12 మంది యువకులు నాలుగు బైక్‌ల మీద దర్గాకు వచ్చారు. సందల్‌ ఉత్సవంలో పాల్గొని శుక్రవారం తెల్లవారుజామున శ్రీనాథ్‌ కొత్త బైక్‌ పూజ చేయించాలని మిగతా ఫ్రెండ్స్‌తో కలిసి గుట్టపై ఉన్న లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లారు. అనంతరం సమీపంలోని కోనేరులో స్నానానికని దిగారు. వీరిలో ఏడుగురు మెట్లపై ఉండి స్నానం చేసి పైకి రాగా.. సాయికుమార్‌(24), శ్రీనాథ్‌(19) కోనేరులోకి దిగారు. ఈత రాకపోవడంతో శ్రీనాథ్‌, సాయికుమార్‌ నీటమునిగి చనిపోయారు.

కమ్మేసిన నిద్రమత్తు..



దుర్గయ్య(ఫైల్‌)

ముస్తాబాద్‌(సిరిసిల్ల): తెల్లవారుజామున హైదరాబాద్‌ నుంచి తిరిగివస్తుండగా కారు నడుపుతున్న సునీల్‌ను నిద్ర ఆవహించడంతో అదుపు తప్పి పక్కనే విద్యుత్‌ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు గంట దుర్గయ్య(45) మృతిచెందాడు. స్నేహితుడు మస్కూరి అశోక్‌ భార్యను హైదరాబాద్‌లోని పుట్టింట్లో దింపి తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న గంట దుర్గయ్య, మస్కూరి అశోక్‌, రేసు శ్రీమాన్‌, ఊషి సునీల్‌ గాయపడ్డారు. దుర్గయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. దుర్గయ్య మృతితో అతని భార్య రేణుక, కూతుళ్లు అక్షిత, ఆకాంక్ష, కుమారుడు శ్రీకర్‌ రోడ్డున పడ్డారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్‌ గుండారపు కృష్ణారెడ్డి, సెస్‌ డైరెక్టర్‌ కృష్ణహరి గీతకార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. క్షతగాత్రులను పరామర్శించారు.

కూతురిని చూసి వస్తుండగా..



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, మేకల నరేందర్‌ (ఫైల్‌)

వేములవాడ/వేములవాడరూరల్‌: వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని శాత్రాజుపల్లిలో శుక్రవారం టిప్పర్‌ ఢీకొని కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన వీఆర్‌ఏ మేకల నరేందర్‌(40) అక్కడికక్కడే మృతిచెందాడు. వేములవాడ శివారులోని గురుకుల డిగ్రీ కాలేజీలో చదువుతున్న తన కూతురును చూసి, పాఠశాలలో జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యాడు. అక్కడి నుంచి బోయినపల్లి మండలం దుండ్రపల్లిలోని అత్తగారింటికి వెళ్లాడు. అక్కడి నుంచి బావబావమరుదులు చెరో బండిపై వేములవాడకు బయలుదేరారు. శాత్రాజుపల్లి దాటగానే వెనుక నుంచి వచ్చిన టిప్పర్‌ నరేందర్‌ బైక్‌ను ఢీకొట్టింది. టిప్పర్‌ టైర్‌ ఎక్కడంతో నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్ది దూరం నుంచి బావమరిది నాగరాజు ప్రమాద స్థలానికి చేరుకోగానే తన బావే అని తెలుసుకొని గుండెలవిసేలా రోదించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వినోద, ఇద్దరు కూతుళ్లు లత, లయ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పుస్తకాలు కొనేందుకు వెళ్లి..



కారుపాలక సతీశ్‌ మృతదేహం

కమాన్‌పూర్‌(రామగిరి):రామగిరి మండలం మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి ఇసుక లారీ ఢీకొని తండ్రి మృతిచెందగా కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని లొంకకేసారం గ్రామానికి చెందిన కారుపాకల సతీశ్‌(37) ఓసీపీ-2లో కాంట్రాక్టు కార్మికుడు. ద్విచక్రవాహనంపై తనకొడుకు సిద్దూ(6)తో కలిసి సెంటినరీకాలనీకి వెళ్లాడు. పుస్తకాలు కొనుగోలు చేసి తిరిగి వస్తుండగా పెద్దపల్లి వైపు వెళ్తున్న ఇసుకలారీ ఢీకొంది. ద్విచక్ర వాహనంపై ఉన్న సతీశ్‌ను కొంతదూరం లాక్కెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందగా, సిద్దూకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సతీశ్‌ కుటుంబ సభ్యులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి.సీఐలు సతీశ్‌, వేణుగోపాల్‌, ఎస్సైలు రవిప్రసాద్‌, వెంకటేశ్వర్లు, రాములు ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు. కాగా.. కుటుంబ సభ్యుల ఆందోళన కొనసాగుతోంది.

చిన్నారిని చిదిమేసిన బైక్‌



మృతి చెందిన జయాన్స్‌రెడ్డి

సైదాపూర్‌(హుస్నాబాద్‌): కరీంనగర్‌ జిల్లా సైదాపూర్‌ మండలానికి చెందిన ఓ చిన్నారిని బైక్‌ చిదిమేసింది. ఎస్సై ఆరోగ్యం తెలిపిన వివరాలు. మండలంలోని దుద్దెనపల్లికి చెందిన చాడ సంపత్‌రెడ్డి కుమారుడు జయాన్స్‌రెడ్డి(3) ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. అదే గ్రామానికి చెందిన చిన్నయాలం దేవేందర్‌రెడ్డి బైక్‌పై వస్తూ చిన్నారిని ఢీకొట్టాడు. తీవ్ర గాయాలవడంతో బాలుడిని హుజూరాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హన్మకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ జయాన్స్‌రెడ్డి మృతి చెందాడు. కేసు నమోదు చేశారు.

క్లుప్తంగా

నేత్రాలు దానం


కుమారస్వామి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డుకు చెందిన బొడ్డు కుమారస్వామి హఠాన్మరణం చెందగా ఆయన నేత్రాలను కుటుంబీకులు దానం చేసేందుకు ముందుకువచ్చారు. సదాశయ ఫౌండేషన్ వారికి సమాచారం అందించడంతో శుక్రవారం నేత్రాలను సేకరించారు. నేత్ర దానంతో అంధులైన ఇద్దరికీ చూపు ప్రసాదించవచ్చని సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ అన్నారు. నేత్ర దానం చేసేందుకు ముందుకొచ్చిన కుటుంబీకులు సరోజ, శ్రీవాణి, సంతోష్, నిక్షిత్, శ్రీవిద్యను సదాశయ ఫౌండేషన్ సభ్యులు లింగమూర్తి, రమేశ్, భీష్మాచారి, చంద్రమౌళి, కేఎస్.వాసు, అన్నపూర్ణ, రాజేందర్, బెణి గోపాల్ త్రివేది అభినందించారు.

విద్యుత్ చౌర్యం కేసులో జరిమానా

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన బూస రాజయ్యకు విద్యుత్ చౌర్యం కేసులో కోర్టులో రూ. 29,400 జరిమానా విధించినట్లు విజిలెన్స్ సీఐ స్వామి తెలిపారు. గతంలో రాజయ్య విద్యుత్ చౌర్యానికి పాల్పడగా మొదటి తప్పుగా భావించిన విజిలెన్స్ అధికారులు జరిమానా విధించి వదిలేశారు. మళ్లీ విద్యుత్ చౌర్యానికి పాల్పడటంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా జరిమానా విధించింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి


నర్సింగరావు (ఫైల్)

మంథని: ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన అల్లాడి నర్సింగరావు (55) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మానేరు శివారులో న ర్సింగరావుకు ఆరెకరాల పొలం ఉంది. శుక్రవారం పొలానికి నీరు పెట్టేందుకు మోటారును మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని విద్యుత్ శాఖ ఏఈఈ హనుమాన్ పరిశీలించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ప్రశాంతతకు మారుపేరు 'రాయదండి'


రాయదండి గ్రామంలోని వీధి

- ఠాణా మెట్లెక్కని గ్రామస్తులు
- నిఘా నేత్రాలతో భద్రత
- గ్రామ అభివృద్ధికి నిరంతర కృషి


జంక్షన్‌లో బిగించిన నిఘా నేత్రాలు

రామగుండం : ప్రశాంతతకు, భద్రతకు అంతర్గాం మండల పరిధిలోని రాయదండి గ్రామం మారుపేరుగా నిలుస్తోంది. గ్రామంలో మొత్తం 95 కుటుంబాలుండగా గంగపుత్రులు–40, ముదిరాజ్–40, మున్నూరుకాపు–15 కుటుంబాలు ఉన్నాయి. గ్రామంలో 421 ఓటర్లున్నారు. ఇందులో గంగపుత్రులు, ముదిరాజ్‌ల కులవృత్తి ఒకే విధంగా ఉండడంతో పాటు చాలా కుటుంబాలకు పరస్పర బంధుత్వం ఉంటుంది. కాగా గ్రామంలో ఎలాంటి గొడవలు, వేధింపులు లేవు. ఎన్నికల్లో పోటీచేసే సమయంలో అభ్యర్థుల మధ్య పోటీ. తర్వాత ఓటమి చెందిన వారంతా గెలుపొందిన వారితో కలిసి ప్రతి ఒక్కరూ గ్రామాభివృద్ధికి పాటు పడాల్సిందే. అంతా ఒకే నిర్ణయం మీద పాలన కొనసాగిస్తున్నారు.

ఏడాదిగా ఠాణా మెట్లెక్కని ప్రజలు

గ్రామంలో కేవలం ఒకరిద్దరు మద్యం తాగి ఘర్షణకు పాల్పడిన ఘటనలే తప్ప శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలు కనిపించలేదు. ఘర్షణలు చోటు చేసుకుంటే గ్రామంలో ఇరుపక్షాల మధ్య రాజీ కుదుర్చుకుంటారు. ఇటీవల రాత్రి వేళల్లో రోడ్డు ప్రమాదాలు, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో సంచరిస్తున్న నేపథ్యంలో గ్రామంలోని ముఖ్య కూడళ్లలో ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యాలయంలో నిఘా నేత్రంలో గ్రామాన్ని పర్యవేక్షిస్తుంటారు. సీసీ కెమెరాలతో గ్రామంలో నిరంతర నిఘాతోపాటు నెలరోజుల వీడియో సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో అనుమానం వస్తే విజువల్స్ పరిశీలించే వెసులుబాటు ఏర్పాటు చేశారు.

అన్ని చోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు



గ్రామంలో బంధుత్వం ఎక్కువగా ఉంటుంది. గతంలో రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే భయంగా ఉండేది. ఇప్పుడు అన్ని చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో ప్రతి ఒక్కరిలో ధైర్యంగా తిరుగుతున్నారు. – చింతపువ్వు మంజుల,

పోకిరీల బెడద తప్పింది



గతంలో గ్రామ సమీపంలో నిర్మానుష్య ప్రాంతాల్లో గుర్తు తెలియని యువకులు ద్విచక్రవాహనంపై జులాయిగా తిరుగుతూ మద్యం తాగేవారు. రోడ్డు ప్రమాదాలతో పాటు అపరిచిత వ్యక్తుల సంచారం ముందుగానే గుర్తించే వీలుండడంతో పోకిరీల బెడద తప్పింది.
– పల్లికొండ సాయికుమార్, గ్రామ యువకుడు

గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నాం



గ్రామస్తుల సహకారంతోనే గ్రామాభివృద్ధికి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. అధికారిక కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తే ప్రతి ఒక్కరూ హాజరవుతారు. గ్రామస్తుల సూచనలను పాలకవర్గం గౌరవిస్తుంది. – తాని పవన్‌కుమార్, ఉపసర్పంచ్, రాయదండి.

రజకుల శాశ్వత ఉపాధికి బాటలు

- రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్


అక్కరాజు శ్రీనివాస్

సిరిసిల్ల: రాష్ట్రంలోని రజకులకు శాశ్వత ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోందని రజక సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ సంస్థల్లో బట్టలు ఉతికే కాంట్రాక్టులను రజకులకే ఇవ్వాలని నిర్దేశిస్తూ శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని వివరించారు. రాష్ట్రంలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల హాస్టల్స్, స్పోర్ట్స్ హాస్టల్స్, దేవాదాయశాఖ ఆలయాలు, ఆర్అండ్‌బీ అతిథి గృహాలు, పోలీస్‌హెడ్‌క్వార్టర్, ప్రాంతీయ ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, బోధనాస్పత్రుల్లో రజకుల వృత్తిపై ఆధారపడిన వారికే కాంట్రాక్టులు ఇవ్వాలని జీవోలో స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఇలాంటి జీవోలు లేక రజక కులవృత్తితో సంబంధం లేని వ్యక్తులు బట్టలు ఉతికే కాంట్రాక్టులు పొంది.. రజకులతోనే పనిచేయిస్తూ శ్రమదోపిడీకి పాల్పడే వారిని శ్రీనివాస్ వివరించారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోతో రాష్ట్రంలోని రజకులకు దీర్ఘకాలిక ఉపాధికి బాటలు పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే కులవృత్తులపై ఆధారపడిన వారికి సంక్షేమ పథకాలను అమలుచేస్తూ రజకులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వసంస్థల్లో బట్టలు ఉ తికే కాంట్రాక్టులు రజకులకు మాత్రమే ఇవ్వాలని జీ వో జారీచేసిన సీఎం కేసీఆర్‌కు, కృషి చేసిన మంత్రులు కేటీఆర్, గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్‌కు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

ప్రాజెక్టు ఇంజినీర్‌కు సన్మానం


సన్మానిస్తున్న జీఎం మనోహర్

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 ఓసీపీ–3 ప్రాజెక్టు ఇంజినీర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన దుర్గాప్రసాద్‌ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దుర్గాప్రసాద్‌ను జీఎం మనోహర్ శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఆర్జీ–2 సెక్యూరిటీ విభాగంలో ఫీమేల్ మజ్దూర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మర్రి శంకరమ్మను జీఎం సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఓటూ జీఎం బచ్చ రవీందర్, పర్సనల్ డీజీఎం రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆర్జీ–1 జీఎం చింతల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయం ఆవరణలో స్వచ్ఛ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం జీఎం మాట్లాడుతూ.. స్వచ్ఛతపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయవద్దన్నారు. ప్రభావిత గ్రామాలైన సుందిళ్ల, ముస్త్యాల, జనగామ గ్రామాల్లో బట్ట సంచులు అందజేసినట్లు తెలిపారు. అనంతరం స్వచ్ఛ పక్వాడ, పరిశుభ్రత– పర్యావరణంపై వ్యాస రచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన సింగరేణి హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, డీజీఎం పర్సనల్ సీహెచ్ లక్ష్మీనారాయణ, సీఎంఓఏఐ అధ్యక్షుడు పొనగోటి శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్ రావు, యాదగిరి సత్తయ్య, మడ్డి ఎల్లయ్య, రమేశ్, సదానందం, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మాదిరెడ్డి భాస్కర్ రావు


మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

గోదావరిఖని: సింగరేణి కార్మికోద్యమంలో మాదిరెడ్డి భాస్కరరావు పాత్ర చిరస్మరణీయమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. శుక్రవారం మాదిరెడ్డి భాస్కర్‌రావు వర్ధంతి సభలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భాస్కర్‌రావు స్ఫూర్తితో కార్మికులు ముందుకెళ్లాలన్నారు. అంతకు ముందు జీఎం కార్యాలయం చౌరస్తాలో భాస్కరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నాయకులు వేల్పుల నారాయణ, ఎల్లాగౌడ్, ఆరెల్లి పోషం, రంగు శ్రీనివాస్, గౌతం గోవర్ధన్, కె.కనకరాజు, భాస్కరరావు కుమారులు శేషకుమార్, శ్రీధర్, కార్మికులు పాల్గొన్నారు.

మోడీ పాలనకు నీరాజనం


మాట్లాడుతున్న ప్రదీప్‌రావు

పెద్దపల్లిరూరల్: ప్రధాని మోడీ పాలనకు ప్రజలంతా నీరాజనం పడుతూ ఆమోదం తెలుపుతున్నారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. స్థానిక అమర్‌చంద్ కళ్యాణమండపంలో పెద్దపల్లి అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సంయుక్త మోర్చాల సమ్మేళనానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధానిగా మోడీ అందించిన 9ఏళ్ల పాలన నీతివంతంగా సాగిందన్నారు. దేశవ్యాప్తంగా దాదాపు 276 పథకాలతో ప్రతి ఇంటికి లబ్ధి చేకూరేలా పథకాలను రూపకల్పన చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా కష్టపడి పెద్దపల్లిపై కాషాయంజెండా ఎగురేయాలన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలు, నాయకులు తంగేడ రాజేశ్వర్ రావు, మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్, మహంత, శ్రీనివాస్, సిలివేరు సంపత్, కోదాటి వెంకట రమణారావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు.. దైవదూతలు

- ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం


కోవిడ్-19 గర్భిణికి పురుడు పోసిన వైద్య బృందం (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): 'ఏం పర్లేదు.. భయపడాల్సిందేమీ లేదు.. తగ్గిపోతుందంటూ.. రోగుల్లో ఆశను రేకెత్తించే వ్యక్తే డాక్టర్. తల్లిదండ్రులు జన్మనిస్తే, వైద్యులు పునర్జన్మనిస్తున్నారు. దైవం మానవ అవతారమే వైద్యుడు. చదువులకు సరస్వతి, ధనానికి లక్ష్మీ దేవతలను పూజించినట్లు... ప్రాణం కోసం మహావిష్ణువు ధన్వంతరి అవతారాన్ని ఎత్తాడని పెద్దలు చెబుతుంటారు. 'వైద్యోనారాయణో హరి'కి నిలువెత్తు నిదర్శనంగా కొందరు డాక్టర్లు సేవాభావంతో రోగులకు ప్రాణం పోస్తున్నారు. ప్రతీ కేసును సవాల్‌గా తీసుకుంటున్నారు. ప్రపంచాన్ని అతలాకుతలం చేస్తున్న అనేక వైరస్‌లపై పోరాటం చేస్తూ, తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజల ప్రాణాలు కాపాడుతున్నా రు. ఏటా జూలై 1వ తేదీని మన దేశంలో 'జాతీయ వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

డాక్టర్స్ డే నేపథ్యం ఇదీ..

భారతీయ వైద్యరంగంలో వ్యక్తిత్వంతోపాటు అన్ని తరాలకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ బీసీ రాయ్ జయంతిని ఏటా జూలై 1న నిర్వహిస్తున్నారు. ఇదే రోజున డాక్టర్స్ డే కూడా జరుపుతున్నారు. స్వాతంత్య్ర సమరయోధుడిగా, విద్యావేత్తగా, సంఘ సంస్కర్తగా.. నిరుపేదలకు ఆపన్న నేస్తంగా వైద్య సేవలందించిన వైద్యుడిగా రాయ్ సుపరిచితులు. 1882లో జూలై 1న జన్మించిన ఆయన కోల్‌కతా, ఇంగ్లండ్‌లలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. వైద్యుడిగా సేవలందిస్తూనే రాజకీయ రంగంలో అరంగేట్రం చేసి, పశ్చిమబెంగాల్ సీఎంగా 12 ఏళ్లపాటు పని చేశారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలోనూ ఆయన రోగులకు నిత్యం ఓ గంటపాటు సేవలందించేవారు. 1991లో ప్రభుత్వం రాయ్ కి భారతరత్న అవార్డు ప్రదానం చేసింది. 1962 జూలై 2న ఆయన మృతిచెందారు.

ఇళ్లలో డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ఫొటోలు..

సృష్టికి ప్రతిసృష్టిగా నిలిచిన వైద్యులు రోగుల బాధలను తమ స్టెతస్కోప్‌తో గుర్తిస్తున్నారు. ధరణిపై దేవతలుగా డాక్టర్లను కొలుస్తున్న కొందరు రోగులు.. వారి ఫొటోలను ఇళ్లలో పెట్టుకొని, పూజలు చేస్తున్నారు. గోదావరిఖనిలో దివంగత డాక్టర్ సాయినాథ్‌రెడ్డి ప్రజల బాధలను మాత్రలతో కాకుండా, మనసుతో తెలుసుకొని, వారి కి దగ్గరయ్యారు. అందుకే ఇప్పటికీ ఆయన ఫొ టోను ప లువురు ఇళ్లలో పెట్టుకున్నారు. మరణించిన తల్లిదండ్రులతోపాటు ప్రాణంపోసిన డాక్టర్‌సాయినాథ్‌రెడ్డికి సింగరేణి మాజీ కార్మికుడు కడమండ రాయమల్లు ఏటా పెత్ర అమావాస్యరోజు బియ్యంఇస్తూ అభిమానాన్ని చాటుకుంటున్నాడు.

రైలునుంచి జారిపడి యువకుడి మృతి

పెద్దపల్లిరూరల్: రైలులోంచి జారి పడి ఓ యువకుడు మృతిచెందగా మ రో యువకుడికి గాయాలయ్యాయి. చత్తీస్‌గఢ్‌లోని గోరఖ్‌పూర్‌కు చెందిన సూరజ్‌కుమార్ (28), ఒడిశాలోని కోమానకు చెందిన రాకేశ్ రోహన్ దురియా ఉపాధి కోసం హై దరా బాద్‌కు వెళ్లేందుకు రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో బయల్దేరారు. పెద్దపల్లి శివారు శాంతినగర్ ప్రాంతంలో రైలు నుంచి జారి పడడంతో సూరజ్‌కుమార్ అక్కడికక్క డే మృతిచెందాడు. రాకేశ్‌రోహన్‌కు గాయాలుకాగా ఆస్పత్రికి తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. మృతుడి తండ్రి ప్రసాద్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ముగిసిన స్వచ్ఛతా పక్షోత్సవాలు

కమాన్‌పూర్ (రామగిరి): ఆర్జీ–3 ఏరియాలో కొన్ని రోజుల నుంచి నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాల కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు ఆర్జీ–3, ఏపీఏ సెక్యూరిటీ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేశారు. జీఎంలు సుధాకర్ రావు, వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.